# గంగి

బి.వి.యస్.రామారావు



వెన్నెట్లో గోదావరి శాంతంగా ప్రవహిస్తోంది. కొండ గాలికి లేచిన పిల్ల అలలు ముత్యాల్లా మెరుస్తున్నాయి. గోదావరి అంతా పరిచిన పట్టుచీర జిగిలా వుంది. పౌర్ణమి పోటుకి సముద్రపు నీరు నదీ ప్రవాహానికి ఎదురీదడంతో దూరాన కనబడుతున్న మారొడి నిశ్చలంగా ఉంది. ఆ మారొడిమీద ప్రతిబింబిస్తున్న చంద్రకాంతి చీరకు పమిటంచులా అమరింది. చీరలో చిరుగులా ఒక చిన్న నావ జలాశయంమీద తేలుతోంది. తెర చాప చుట్టే పరమాను! కర్ర పడవ బొద్దిదాకా దింపబడి వుంది. తెర చాప ఎత్తే కొయ్యకర్ర మైదానంలోని మొండి తాటిలా భయంకరంగా వుంది.

సుబ్బడు చుక్కాని కాస్తున్నాడు. తెడ్డుని మోచేతి మడతలో బిగించి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. కొడిగట్టిన బీడీ పెదిమలకు వేడి నందిస్తోంది. దహించుకుపోతున్న సుబ్బడు మనసుకు ఆ చల్లని వేడి ఉపశమనం కలిగిస్తోంది.

గొలుసు కట్టలా బీడీలు ఒక దాని తర్వాత ఒకటి కాలుతోంది. నావ మందకొడిగా తూర్పువేపుకు సాగుతోంది.

నావ నడుమ జల్లిగంపనిండా ఇసుకపోసి ఆ ఇసుకమీద పొయ్యి



పెట్టి అంబలి కాయడం ముగించి ఆరిపోతున్న మంటల చివరగతో ఎండు చేపను కాలుస్తూగుంభనంగా కూర్చొన్న సుబ్బడి గురించి ఆలోచిస్తోంది గంగి.

"ఈణ్ణి చేసుకొని ఏడావి కావస్తోంది. మనువాడిన కాడనుండి ఈడితో ఈ నావలో కాపరం చేత్తున్నాను. ఈడి మనసెలాటిదో అర్ధంగావటంలేదు. ఉంటే మట్టగిడసలా గంతులేస్తూ వుషారెక్కించి సొరగం చూపిత్తాడు. లేకుంటే ఇట్టే అలిగి బండరాయి అయిపోయి నరకయాతన పెడతాడు. ఈడితో యాలా ఏగాలో ఆ గోదావరి తల్లికే యెరిక" అని వాపోతుంది గంగి.

బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చి, ఆరిపోయిన బీడీ ముక్క విసిరికొట్టి మరో బీడీ అంటిస్తూ అగ్గిపుల్ల మంటగుండా గంగిని చూసి కార్యాలోచనలో పడ్డాడు సుబ్బడు.

వంట ముగించి భుజాల దగ్గర కుట్లు పిగిలిన నల్ల రవికబాపతు తెల్లదారపు పోగులను మునివేళ్ళతో ముడేస్తూ అమాయకంగా చూసింది సుబ్బడికేసి గంగి.

వంట ముగించి సరంజామా సర్ది సుబ్బడికేసి నడిచి "సాల్లే! అలసిపోయావు. కొత్త కూడు తిను." అని అతని పక్కన చేరి

చుక్కాని లాక్కుంది గంగి. సుబ్బడు ఈసడించుకొని లేచి నడిచక్కమీద కొయ్య పెట్టెకాను కొని తిరిగి నక్షత్రాలు లెక్క పెట్టడం మొదలెట్టాడు.

* * *

సుబ్బడికి పెళ్ళీడు రాగానే తనకన్నా కాస్త పెద్దదైన మేన కోడలు గంగిని పెళ్ళాడతానని బిగుసుకుపోయి కూర్చున్నాడు. రెండు కుటుంబాల పెద్దలూ కూడ బలుక్కొని వాళ్ళిద్దరికీ ముడి పెట్టి, చెరి ఒక విసురు వల పెళ్ళి కానుకగా చదివించి మీ బతుకులు మీరు బతకమన్నారు.

దాంతో పట్నంలో షావుకారు దగ్గిర నావ ఒకటి అద్దెకు తీసు కొని, దానిలోకి తమ సంసారం మార్చి, వచ్చిందాంతో కాలక్షేపం చేస్తున్నారు గంగి, సుబ్బడు.

సుబ్బడు కండలు తిరిగిన శరీరంతో పుష్టిగా వుంటాడు. ఎప్పుడూ నీళ్ళల్లో నానుతూ ఉంటాడు కాబట్టి నేరేడుపండులా శరీరం నిగనిగలాడుతూ ఉంటుంది.

కోలముఖం, ఒత్తైన కురులు, గుండ్రని మెరిసే కళ్ళతో గంగి ముఖం ఎంతో కళగా వుంటుంది. సుబ్బడికన్నా కాస్త ఛాయ ఎక్కువైనా గంగిని నల్లపిల్ల కిందే జమ కట్టాలి. ఈ జంట బాపతు నావ రేవు తాకితే చాలు అందరి కళ్ళూ వయస్సులో వున్న గంగి వంపులు తిరిగిన శరీరం మీదే. గంగిలాంటి పిల్ల జోడైనందుకు సుబ్బడంటే అందరికీ అసూయ. నావలో ఆ జంటను చూసిన ప్రతివాడూ సుబ్బడి స్థానంలో తనని తప్పక ఊహించుకొంటాడు. అందరికీ చేపలవేట పొట్టకూటి కయితే, చల్లని గోదాట్లో ఏకాంతంగా నావలో ప్రయాణం చెయ్యడం ఈ జంటకో విలాస యాత్ర. తప్పని సరై పట్టెడు చేపలు అమ్మడం మినహా సంపాదన ధ్యాస లేదు ఈ జంటకి.

అలా ఆ చిన్ననావలో క్షణ క్షణం ఓ మధురక్షణంలా గడిచి పోతున్న రోజుల్లో ఓనాడు పట్నం రేవు చేరగానే షావుకారు గుమాస్తా నావనటకేసి సుబ్బడ్ని నిలదీసి పడవ అద్దెబాపతు మూడు నెలల బకాయి చెల్లిస్తేకాని వీల్లేదని మొండికేసి కూర్చున్నాడు. ఆ నల్లటోపీ, చిరుగుకోటు, వెలిసి పోయిన గొడుగు, ఒక కాడ విరిగి దారంతో చెవికి మెలేసిన కళ్ళ జోడు, హైరు చెప్పులు, బక్కగా రోకలి మింగిన శరీరంతో అడ్డు లేచి అజమాయిషీగా రేవు నేత్తే

స్తున్న కైలాసం. షావుకారు కాస్త కరుణించినా వరమీయని పూజారిలా అడ్డుతగిలి పితలాటం పెట్టేస్తాడని అక్కడ పడవజనాభా కందరికీ తెలుసు.

ఇలాంటి లావాదేవీల్లో అనుభవంలేని సుబ్బడు డీలా పడిపోతూంటే ఎల్లి ఆ షావుకారుగార్నే పట్టుకుందామంది గంగి. సరే అని వలలను భుజాన్న వేసుకొని బిళ్ళగోచీతో సుబ్బడు, సంసార సామగ్రి యావత్తూ సర్దిన జల్లి గంపను చంక నేసుకొని గంగి బిక్కు బిక్కుమని కాళ్ళీడ్చుకుంటూ వీధులన్నీ తిరిగి షావుకారు కొట్టు చేరారు.

అదొక అగ్గిపెట్టెలాంటి సన్నని మేడ. కింది భాగం చాపలు పరుచుకొని రాత బల్లల దగ్గర చతికిలబడి చిట్టా అవర్జాలతో మునిగిన గుమాస్తాల ఆహా ఊహూలతో గగ్గోలుగా వుంది.

చిత్తుకాయితాల దగ్గర్నుండి, జీడిపప్పుదాకా కూరగాయల దగ్గర్నుండి డీజలు ఆయిల్‌దాకా కమీషన్ వ్యాపారం చేసే ఆ షావుకారికి అద్దెకు తిప్పే బోట్లు పడవలు బొచ్చెడు నావలు కూడా సైడ్ బిజినెస్‌గా వున్నాయి. వీధిగుమ్మం దగ్గర బ్రోకర్లు ఈగల్లా ముసిరి వున్నారు.

సుబ్బడికందులో ఎవడు షావుకారో ఎవరు కాతావారో తెలియక అయోమయంగా వుంది. చీకటి ముదరగానే అక్కడి జనాభా పూర్తిగా సన్నగిల్లాక గుమాస్తా లందరూ బిలబిలమంటూ బయట పడుతున్నారు. చొరవ చేసుకొని తనొచ్చిన పనేంటో అందులో ఒక గుమాస్తాకు విన్నవించుకున్నాడు సుబ్బడు.

"షావుకారు మేడమీద ఖాళీగా కూర్చున్నాడు. పోయి ఆయనకి చెప్పుకోండి పని జరుగుతుంది" అన్న సలహా పాటించి ధైర్యం చేసి మేడ మెట్లెక్కాడు సుబ్బడు, గంగి. మేడ వెనుకనున్న చిన్న డాబాలో మడతమంచం మీద కూర్చున్న షావుకారి కాళ్ళమీద పడ్డాడు సుబ్బడు.

సిల్కు లాల్చీ, కట్ బనీను, పాప్లైన్ పైజామా, మెళ్ళో పులిగోరు పతకం. లాల్చీకి బంగారు బొత్తాలు, బొత్తాలకి పొడుగుపాటి గొలుసు అన్ని వేళ్ళకు పొళ్ళతో ఉంగరాలు మణికట్టుకు బంగారు చైను రిస్టువాచీ, నడివయస్సు చిరుబొజ్జతో తుమ్మమొద్దులాంటి శరీరానికి పూసిన ఘాటైన కునేగా మరికొళందు

సెంటు ఘమఘమలతో షావుకారు సుబ్బడ్ని చూసి, చీదరించుకో బోయి పిటపిటలాడుతున్న గంగిని చూసి ముఖం చేటంత చేసుకొని విషయమేమిటో చెప్పమన్నాడు. ఈలోగా కైలాసం రానే వచ్చి విషయమంతా పూసగుచ్చినట్టు వివరించి ఇలాంటి వాళ్ళకు నావ అప్పనంగా ఇచ్చేకన్నా వ్యాపారం చాలించడం మేలని ముగించాడు.

అంతవరకూ గంగిని పైకి కిందికి చూపులతో జుర్రేస్తున్న షావుకారు "ఏటే! మరిల్లాగయితే ఎల్లాగే? పోనీ ఈసారికి వదిలేస్తాను. నా బాకీ ఓ నెలలో చెల్లగొడతాడేమో నీ మొగుణ్ణడిగి చెప్పు" అన్నాడు గంగి వంపు సొంపులను షిఫాన్ చీరలో అంచనాలేస్తూ.

"మా ప్రభులు! మీరన్నట్టే తీర్చేత్తామండి" అని సుబ్బడి తరపున హామీ యిచ్చింది బిక్కచచ్చి, మెలికలు తిరుగుతూ గంగి.

"అయ్యా! వీళ్ళతో వేగలేం. వీళ్ళదగ్గర రెండు వలలున్నాయి. ఓవల తాకట్టు వుంచుకొని వంద రూపాయలు ముందు జమేసుకోండి. మిగిలిన బాకీ వడ్డీతోసహా వంద రూపాయలూ జమకట్టేలోగా ఇంకో అన్ని రూపాయలు ఈ నెల కేవుకి ఎలాగా బకాయిపడుతుంది." అని గోడు పెట్టుకున్నాడు కైలాసం.

"అసలు చేపలు పట్టనోళ్ళకి వలలెందుకే? అవి వరచుకొని తొంగోడానికా? ఓవల తాకట్టెట్టి, మిగిలిన బాకీ తర్వాత తీర్చుకోండి పొండి" అని షావుకారు అనగానే ఉసూరుమంటూ మేడమెట్లు దిగారు సుబ్బడు, గంగి.

వాళ్ళవెనకాలే కైలాసం దిగి రెండు వలల్లో మంచివల ఎన్నుకొని దానికోవంద రూపాయలు జమేసి "ఇదిగో! ఈ చిటీ తీసుకొచ్చి, వంద రూపాయలూ ఈ ఆఫీసులో కడితే నీ వల నీకు దక్కుతుంది." అని ఓ పసుపుపచ్చ చీటీ సుబ్బన్న చేతిలో పెట్టాడు. బ్రతుకు జీవుడా అంటూ రేవుకేసి నడిచారు సుబ్బడు గంగి.

ఇలా వీధి మళ్ళేలోగా ఒరేయ్ సుబ్బడూ అంటూ గావుకేక పెట్టి పరిగెత్తుకొచ్చాడు కైలాసం. మళ్ళీ ఏం మెలిక పడిందోనని కంగారుపడ్డాడు సుబ్బడు.

"ఒరేయ్ సుబ్బా! నీ రొట్టె విరిగి నేతిలో పడింది. షావుకారు నీ అద్దె మాపు చేస్తానంటున్నాడు. గంగి కాస్త చల్లచూపు చూపించిందంటే నీకప్పనంగా పడవనే దాన

మిస్తాడు" అని పొంగిపోతూ సుబ్బడి చెవిలో గుసగుసలాడాడు.

సుబ్బడికి విషయం అర్థంగాక "ఏమిటి బాబూ! ఇప్పుడు నేనేం చెయ్యాలి" అన్నాడు.

"ఓరి పిచ్చినాగన్నా! అయ్య గారికి గంగి నచ్చిందంటే సామాన్యమా! దాన్నోసారి అయ్యగారి దగ్గరకు పంపి ఓ గంట ఇక్కడ కళ్ళు మూసుకూర్చోర్చో. నీ కష్టాలు గట్టెక్కుతాయి" అని సాగదీసు కుంటూ విడమర్చి చెప్పాడు. అసలు విషయం అర్థమయింది సుబ్బడికి.

"ఈయేల కూటికి లేనోళ్ళం కావచ్చు, కాని గుడిసెట్టోళ్ళం మాత్రం కాదు. ఇలాంటి ఎదవ కబుర్లు నాకు సెప్పకండి" అనగానే కైలాసం ఎంతో జాలిపడి "ఓరి పిచ్చోడా! అళ్ళకూడు నువ్వు తింటున్నావు. ఆ మాత్రం అడిగే హక్కు ఆళ్ళకుంది. తీర్చే అవసరం నీకుంది. ఈ గుట్టు మన మధ్యనే వుంటుంది. బాగా ఆలోచించుకో" అనగానే సుబ్బడికి చిరాకేసి "నువ్వూ ఆరి కూడు తింటున్నావు. నువ్వూ నీ పెళ్ళాన్ని ఆరి దగ్గర తొంగోబెట్టావా?" అని విల దియ్యగానే కైలాసం కొయ్యబారి పోయాడు.

దూరంగా సంగతేంటో అర్థం గాక అలసిపోయి రోడ్డువారగా చీకట్లో చతికిలపడిన గంగిని, జబ్బట్టుకులేపి "రాయే పోదాం" అంటూ రేవుకేసి నడిచాడు సుబ్బడు.

ఆరోజు ఆకలి కడుపులతో నావ మందకొడిగా సాగింది. నీర్సంగా ఆకాశంకేసి చూస్తూ గడిపారు ఆ రాత్రి గంగి, సుబ్బడూ.

మర్నాడు గంగికి నాలుగు పుంజీల బచ్చుచేపలు చేజిక్కాయి. దగ్గరలో వున్న రేవునిచేరి అడిగిన ఖరీదుకిచ్చేసి నూకలు సంపాదించింది గంగి.

కడుపు చల్లబడగానే కుదుటపడి క్రితంరాత్రి కైలాసం తన చెవిలో చెప్పిన మాట, వాడికి తను బుద్ధి చెప్పిన విధానం హుషారుగా గంగితో చెప్పేశాడు సుబ్బడు.

"అంటే నే నో గంట ఆరితో వుంటే యింత ఖరీదైన పడవ ఊరికే యిచ్చేత్తారన్నమాట! మరి మావా! నేవిన్నాళ్ళు నీతో ఉంటన్నానుగందా! నువు నాకెంత బాకీ!" అని కొంటెగా ప్రశ్నించింది గంగి. అలా వేళాకోళంగా అన్న మాటలకు సుబ్బడి సున్నితమైన మనస్సు చివుక్కుమంది.

షావుకారు బాకీ ఎలాగైనా

తీర్చిపారేయాలని వేట ఉధృతం చేసి అహర్నిశలూ శ్రమించేరు సుబ్బడు.

రెక్కలు ముక్కలు చేసు కున్నా కూటికి గడిచి, నావ కిరా యికి చాలినంత చేతికందక పోవ డంతో సుబ్బడికి బ్రతుకే చిరాకని పించింది.

పట్నం చేరేముందు సంపా దించిన చిల్లరంతా లెక్క చూసు కుంటే పట్టుమని పాతిక రూపాయ ల్లేవు. కైలాసంగాడి బారినుండి ఎలా తప్పించుకోవాలా అని దిగాలుగా ఉన్నాడు సుబ్బడు.

"మావా! ఆ షావుకారడిగినట్టు నేనోగంట ఆరికాడ కెళ్ళి కళ్ళు మూసుకుంటే మన కట్టాలు తీరి పోతాయ్. నువ్వు 'ఊ' అను చాలు. నాకిట్టంగాక పోయినా, యీ కట్టాన్ని బరిత్తాను" అంది గంగి అమాయకంగా యింకేం గత్యంత రం కనపడక.

ఆ మాటకు తోకతొక్కిన త్రాచైపోయి గంగి జుట్టట్టుకుని ఫెడీ ఫెడీ మని చెంపలు ఛడీలు మనిపించాడు సుబ్బడు. "నీకు సిగ్గు ఎగ్గూ నేదా? ఆడి దగ్గర తొంగుంటా నంటావా? మళ్ళీ యిలాంటి కూతలు కూత్తే పీక పిసికి గోదాట్లో పడేత్తా!" అని కసి తీరా రవిక చిరిగేలా గంగిని చితక బాదేడు.

బిత్తరపోయి కొయ్య కర్రవి కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడు స్తున్న గంగికి తను అన్నదాంట్లో తప్పేంటో, దాని పర్యవసాన మెలాంటిదో అర్థంగాక తన మొగుడు అన్యాయంగా పశువులా ప్రవర్తించినందుకు దుఃఖించింది.

కొన్ని గంటలు మౌనంగా గడిచేక, "సర్లే ఏటయితే అదవుద్ది. ఈ పాతికా కైలాసం మొగాన కొట్టేద్దాం. ఆడు నావని అటకాయిత్తే ఆడిమీద కాంద్రించి ఉమ్మేసి ఏదో కూలి పని చేసుకు బదుకుదాం" అంటూ తెరచాప ఎత్తాడు సుబ్బడు.

నావ పట్నం రేవుకేసి నడక ప్రారంభించింది. రేవు చేరేటప్ప టికి సాయంకాలం నాలుగయింది. అప్పటికి గోతిదగ్గర నక్కలా కైలాసం రేవులో కాసుకూర్చు న్నాడు. ఉన్న పాతిక జమ కట్టాడు సుబ్బడు. ఇలా పాతిక, పరకలతో నీ బాకీ జన్మలో తీరదు. ఈ నెలకిది జమేసుకుంటా. అంటూ మిగిలిన ఒక వలనీ లాక్కున్నాడు. ఈసారైనా చచ్చి నట్టు గంగి విషయంలో లొంగు తాడని.

"బాబ్బాబు! ఈ వల వదిలే యండి. ఇది లేకపోతే మేం బతక లేం" అని సుబ్బడెంత ప్రాధేయ పడినా ససేమిరా అని వలను భుజాన్నేసుకుని చక్కా పోయాడు కైలాసం.

అప్పటివరకూ పడవలో ఓ మూల వొదిగి కూర్చున్న గంగి మొహంలో, ఓ నిశ్చితాభిప్రాయం కనిపించింది. చటుక్కున లేచి నిలబడింది. "ఏమిటి?" అన్నాడు గంగులు అర్థంగాక.

"మావా! నేనిప్పుడే వత్తా" అంటూ ఛెంగున నావ దిగి మెరుపులా గట్టుమీదికి పరిగెత్తింది గంగి.

'ఒలే! ఆగవే!' అంటూ తను పెట్టిన కేకలు గంగి వినిపించుకోకుండా పోవడంతో వళ్ళు మండ సాగింది సుబ్బడికి.

చీకటి పడినా యింకా గంగి జాడలేదు. రేవు సద్దుమణిగి ఒకటి రెండు మినహా నావలన్నీ పేటకెళ్ళి పోయాయి. మండిపడుతున్నాడు సుబ్బడు. గంటలు గడిచేకొద్దీ దాని కేమైనా అయిందేమోనని అను మానం కలిగి కంగారుపడసాగాడు. తెలుసున్న పడవవాడు కూనిరాగాలు తీస్తూ రేవులోకి దిగడం చూసి, "ఏరా పోలిగా! గంగికాని కన బడిందిరా? సందేలనగా యెల్లి పోయి పత్తాలేదు" అని అడిగాడు.

"సందేల చూశానురా! షావు కారు కొట్టుకేసి అడావిడిగా యెల్తోంది. ఎందుకోసమో నను కున్నా."

హతాశుడయ్యాడు సుబ్బడు.

గంగి అన్నంతపనీ చెయ్య డానికే వెళ్ళిందని నిర్ధారించు కున్నాడు. అటికేసి వెళ్ళడానికి గంగికి యింకేదైనా కారణం వుందా అని అనేక రకాలుగా ఆలో చించాడు. తన ఎరికలో గంగికి పట్నంలో తెలిసిన వాళ్ళే లేరు! బజారు కెళ్ళిందా అంటే అసలు చేతిలో పైసా కూడాలేదు. మరి యిందుక్కాక ఎందుకెళ్ళిందో అంతు పట్టడంలేదు సుబ్బడికి.

"అదిగో అంజిగాడొత్తున్నాడు. ఆడు షావుకారి కాడికే యెల్లాడు" "ఏరా! అంజిగా! మన సుబ్బడి పెళ్ళాం గంగిని చూశావ్రా!" అని అడిగాడు పోలిగాడు.

"షావుకారు కొట్టుకాడి కొచ్చింది. ఆడు పిలిచారంటే మేడమీద కెళ్ళింది. యెల్తూ నన్ను జూసి కంగారుపడి మా సుబ్బడి మామకు నే నిక్కడికొచ్చినట్టు చెప్మాక అంది. ఓరేయ్! ఆడికి క్కాని చెప్పావు. నాచేత ఒట్టే

యించుకొంది." అన్నాడు అంజి గాడు చీకట్లో కూర్చున్న సుబ్బణ్ణి గమనించక.

సుబ్బడికి ముచ్చెమటలూ పట్టాయి. గుండెల్లో రైళ్ళు పరిగెత్తసాగాయి. ఇంకక్కడ వుండలేకపోయాడు. పడవను వడిలోకి నెట్టి నది గోదాట్లోకి దూసుకుపోయాడు.

తన్నింత మోసంచేసిన గంగిని వదిలెయ్యాలనుకున్నాడు. కాని ప్రాణాలతో విడిచి పెట్టకూడదనుకున్నాడు. గంగిని సంజాయిషీ అడిగితే వాదనలోకి దిగవలసి వస్తుంది. తనకు కోపం వచ్చి నాలుగు బాదొచ్చు.

ఈ గొడవనలుగురు నోట్లోనూ పడుతుంది. కనుక గుట్టు చప్పుడు గాకుండా పీక పిసికి గోదాట్లో గెంటేసి జరిగిందల్లా ఓ పీడకలలా మరచిపోవడమే మేలనిపించింది.

దూరాన్నుంచి గంగి కేకలు వినబడ్డాయి. రేవుకేసి చూశాడు. ఉన్న కాసిన్ని పడవలు వేటకెళ్ళిపోయాయి. అనాలోచితంగా రేవుకేసి నావ మళ్ళించాడు.

"ఏటి మావా! నీవు కనపడక పోతే నాకు వొణుకు దడ పుట్టింది. నా మనసేటయిపోతాదో తెలుసుకోక అలా ఒగ్గేసి పోతావా? అని సంజాయిషీ అడిగింది, దరికి చేరుతున్న నావలోకి తను తెచ్చిన వల విసిరేస్తూ.

ఒడ్డుమీద గంగిని ఓరగా చూశాడు. గంగి ఓ కామ పిశాచంలా కనబడింది. హాలాహలాన్ని దిగమింగి గుండె రాయి చేసుకొని గుంభనంగా వున్నాడు.

కొంగులోని సరుకుల మూటతో చేతిలో బీడీకట్టతో కిలకిలమంటూ ఛెంగున గంతేసింది నావలోకి గంగి.

ఎదేదో చెప్పబోయి మొగుడు వాలకం చూసి మాట్లాడకూరుకుంది గంగి. వెన్నెల కురుస్తున్న సమయంలో నావ వడిలో పడింది.

* * *

ముభావంగా వుండడం, మాటిమాటికీ అలగటం సుబ్బడికలవాటే అయినా ఈ రాత్రి ఇంత ఇలా బిగుసుకుపోవడం గంగికి ఆందోళన కలిగించింది.

సుబ్బడు దేన్ని గురించో బాధపడుతున్నాడని పసిగట్టింది. చుక్కాని తెడ్డుని తాటితో బిగించి చెమట పట్టిన శరీరానికంటుకున్న రవికెను విప్పి పడి చక్కామీద ఆరేసి సుబ్బడ్ని చేరింది. సుబ్బడి కళ్ళు దేన్నో తీక్షణంగా చూస్తున్నాయి. వేటిని చూస్తున్నాయో అన్నది అంత చిక్కడం లేదు

గంగికి. భుజంమీద చెయ్యేసి తన కేసి తిప్పుకొని సూటిగా చూస్తూ, "మావా! నీకేమైనాది? నాదగ్గ రెందుకుదాస్తావు అయ్యో నీ ఒళ్ళు కాలిపోతోంది ఇలా కూర్చో" అని నావ తొట్టెలో కూర్చుని సుబ్బడి ఛాతీని, తన ఛాతీకి హత్తుకొని అర చేతితో భుజాలు రాస్తూ, కంటనీరు పెట్టి "మావా! నువ్వెప్పుడూ మనసు ఇప్పి మాట్టాడవు. ఏదో దాచుకొని నీలో నువ్వే యిద్దైపోతావు" అంది.

ఛటుక్కున లేచి, మరో బీడీ అంటించి గంగికేసి చూశాడు సుబ్బడు. గంగి అందంలో చందనం బొమ్మ. ఆకర్షణలో సూదంటురాయి. ఇలాంటిదాన్ని పోగొట్టుకోగలనా అని ఒక్క క్షణం అనిపించింది సుబ్బడికి.

మరుక్షణమే షావుకారు ఒళ్ళో కులుకుతున్న గంగిని తలచుకొని మనస్సు దహించింది. బీడీని పూర్తిగా ఒక్క దమ్ములో పీల్చి పారెయ్యబోయి, మరో దమ్ము లాగి ఈ ఆఖరి దమ్ములాగే 'దీనితో కూడా ఇదే ఆఖరుసారి, అనుకొని గంగిని తనవైపుకు లాక్కొని ఎంత వారించినా వినకుండా పశువులా ప్రవర్తించి తన కామ దాహాన్ని తీర్చుకున్నాడు.

అలాంటి హింస తనెప్పుడూ పడనందున తన భర్త అలా మృగంగా మారినందుకు నొచ్చుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ లేచి చీరకుచ్చిళ్ళు సర్దుకుంటోంది గంగి.

ఏడుస్తున్న గంగిని చూడగానే రోత పుట్టించి సుబ్బడికి. వెంటనే తన కర్తవ్యం గుర్తుకొచ్చింది. పక్కనే వున్న తాడు చూశాడు. ఆ తాడును తియ్యడం దాన్ని గంగి మెడకు వెయ్యడం కోల కర్రతో తాడును మెలితిప్పి బిగించడం మూలుగుతూ కుప్పలా గంగి ఒక్కసారి కూలిపోవడం అన్నీ క్షణాల మీద జరిగిపోయాయి.

అలా భర్త పైశాచిక ప్రవృత్తి భార్యను బలిగొంది. గంటల తరబడి పీడించిన ద్వేషావేశాలు సుబ్బడిలో హఠాత్‌గా మాయమయ్యాయి. ఉన్నట్టుండి నీరసం ఆవహించింది. మానసిక దౌర్బల్యం సంతరించింది. కాళ్ళూ, చేతులూ వణకసాగాయి. ఒంటరితనం భయపెట్టించి.

ఇలాంటి ఘోరం ఇంత సులువుగా జరిగిపోతుందనిపించ లేదు. తనిప్పుడో హంతకుడని గుర్తుకొచ్చింది. హంతకుడికి శిక్ష చావేనన్న సంగతి కూడా గుర్తుకొచ్చింది. బ్రతుకు తీపనిపించింది. తానేలాగేనా బ్రతకాలనుకున్నాడు.

ఎవరైనా చూశారేమోనని అను మానమేసి గోదావరంతా కలియ చూసాడు. కనుచూపు మేరలో ఏమీ కనపడలేదు. ఒక్క క్షణం మనసు కుదుటపడింది. వణుకు తున్న చేతులతో గంగి మెళ్ళోని తాడు వదులుచేశాడు.

గంగి ముఖం చూడ్డానికి భయ పడి కొంగు కప్పాడు. విడిన చీర కుచ్చిళ్ళు హడావిడిగా సర్దాడు. గంగి శవాన్ని చేతులమీద ఎత్త డానికి ప్రయత్నించాడు. కొన్ని టన్నుల బరువు ఎత్తినట్లనిపిం చింది. అతికష్టం మీద నావ బొద్ది మీదకు ఎత్తి కళ్ళు మూసుకొని గోదాట్లోకి తోసేశాడు. నావ హఠాత్కపడి అదిరి ఉవ్వెత్తున కొట్టుకుంది. భయపడి తొట్టెలో కూలబడ్డాడు.

కళ్ళు తెరిచేసరికి గంగి ప్రాణం తీసిన కట్టుతాడు కనపడింది. దానికి మెలికపడ్డ పసుపుతాడు ఒకటి కన పడింది. దానికి కొత్తగా ముడి వేయబడ్డ పచ్చని మావిడాకు చుట్ట కనిపించింది.

పసుపుతాడుకి యీ మామిడా కేమిటి? మరి ఈ పసుపుతాడుతో తాను కట్టిన మంగళసూత్రాలు ఏమయ్యాయి? వాటిని ఏమి చేసింది గంగి?....బిక్కమొహంతో నక్కి చూస్తున్నట్టు నావ పడి చెక్కవి గుచ్చిన ఏదో కాగితం భయంతో రెపరెపలాడుతూ కన్పించింది సుబ్బడికి. పటాలున వంగి చేతుల్లోకి తీసుకొని పరీక్షగా దాన్ని ఆ గుడ్డి వెలుతుర్లో చూశాడు. చదువు రాకపోయినా అది మార్వాడీ వాడి దగ్గిర లోగడ తను తాకట్టు పెట్టిన రసీదు కాగితంలాంటిదేనని తెల్సుకోడానికి అట్టేసేపు పట్టలేదు సుబ్బడికి. 'అయితే గంగి మంగళ సూత్రాలు తాకట్టు పెట్టి షావుకారు దగ్గరకి వలతేవడానికి ఎల్లిందన్న మాట!'

క్షణాల్లో తన గంగి-గంగమ్మ తల్లి అంత పవిత్రురాలని తెలిసి వచ్చింది. తన గంగి యింకా బ్రతికే వుందవచ్చుననిపించింది. 'గంగీ!....' ఆకాశం బ్రద్దలయ్యేలా సుబ్బడు ఒక్క గావుకేక పెట్టి అగాధంలోకి దూకేశాడు.

ఆ కేకకు చలించిపోయిన గోదావరిని చూపి, చంద్రుడు అదిరి మబ్బుల్ని చాటు చేసుకొన్నాడు.

లోకమంతా నల్లబడింది....

రోజూ కిలకిల్లాడుతూ తనతో బాటు విహరించే ఆ జంట లిప్త కాలంలో కనుమరుగు కావడంతో వెలవెలబోయిన ఆ నావ బావురు మంది. •